క్లుప్తంగా

సంక్షేమ పథకాలు నేరుగా అందించాలి

భద్రాచలంటౌన్: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలకు నేరుగా అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేద ప్రజల ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐటీడీఏ రోడ్డులో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో రాజకీయ పార్టీల జోక్యం పెరిగిపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని, పథకాల అమలులో అధికారుల నిర్లక్ష్యం, వివక్షత పెరిగిపోయిందన్నారు. సమావేశంలో అలవాల రాజా పెరియార్, కొప్పుల రాంబాబు, పెదబాబు, సమ్మక్క, లత, హేమలత, రమాదేవి, సుభాషిని, కుమారి పాల్గొన్నారు.

సీఎంఓకు ఘన సన్మానం



మణుగూరు రూరల్: సింగరేణిలో సుదీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ పొందుతున్న చీఫ్ మెడికల్ ఆఫీసర్ బి.వెంకటేశ్వరరావు దంపతులను మణుగూరు ఏరియా ఎస్‌ఓటూ జీఎం కృష్ణయ్య బుధవారం ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా డీజీఎం(పర్సనల్)ఎస్.రమేష్, డీవై సీఎంఓ మేరికుమారి, సర్జన్ జ్యోతిర్మయి, వైద్యులు శేషగిరిరావు, సురేష్, వెంకటరమణ, జేఏ రవికుమార్, సులోచన, అనురాధ, అన్నపూర్ణ, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ మండలసభ

ములకలపల్లి: ఏఐఎస్ఎఫ్ మండల మహాసభ విజయవంతమైంది. మండలకేంద్రంలో బుధవారం సంఘ మండల నాయకులు రాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, ఐఏటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరాటి ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. అనంతరం సంఘ నూతన మండల సమితిని ప్రకటించారు. మండల కార్యదర్శిగా లిలిత్, మండలాధ్యక్షుడిగా పవన్, సహాయ కార్యదర్శిగా నిఖిలేశ్, వందనప్రసాద్, శివ, సందీప్‌లను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మల్లిఖార్జునరావు, ఎండీ. యూసఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అర్గనైజింగ్ సెక్రటరీ వర్కా అజిత్ పాల్గొన్నారు.

కళ్లకలకపై అవగాహన

అన్నపురెడ్డిపల్లి: కళ్లకలకపై ఎర్రగుంట పీహెచ్‌సీలో మండల వైద్యాధికారిణి డా.ప్రియాంక ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని, కళ్ల కలక వ్యాధి గురించి వివరించారు. ఆప్తమాలజీ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, హెచ్ఈఓ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

స్టేషనరీ పంపిణీ

దుమ్ముగూడెం : మండలంలోని తోగ్గూడెం గ్రామంలోని జీపీఎస్ పాఠశాల విద్యార్థులకు ఐటీడీఏ జీపీఎస్ ఆధ్వర్యంలో స్టేషనరీ సామగ్రి బుధవారం పంపిణీ చేశారు. హెచ్ఎం బి.రవి, సిబ్బంది పాల్గొన్నారు.

వేజ్‌బోర్డ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

మణుగూరు రూరల్: సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని మణుగూరు ఏరియా హెచ్ఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షురాలు కొడిపల్లి శ్రీలత యాజమాన్యానికి డిమాండ్ చేశారు. బుధవారం హెచ్ఎంఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గత 23 నెలలుగా యాజమాన్యం కార్మికులకు వేజ్‌బోర్డ్ బకాయిలను చెల్లించలేదన్నారు. హెచ్ఎంఎస్ నాయకులు అజార్‌ఖాన్, సతీష్, రశబ్, జీవన్ జమాల్, అనిల్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎంపిక నిర్వహించాలి

ములకలపల్లి: తెలంగాణా ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి, బీసీ, దళితబంధు తదితర పథకాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని ఆదివాసీసేన రాష్ట్ర సహాయ కార్యదర్శి ఊకే రవి అన్నారు. ములకలపల్లిలో బుధవారం జరిగిన సంఘ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. నాయకులు కణితి వినోద్, సున్నం సింగయ్య, ఎలకం కన్నయ్య, ఊకే బక్కు, సడియం పోతప్ప, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


హమాలీల సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలంఅర్బన్: హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చెన్నుపాటి ట్రాన్స్‌పోర్ట్ హమాలీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ కంభంపాటి సురేష్‌ను కలిసి సంఘం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు ఎస్. నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు మర్లపాటి రేణుక మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.సంతోష్, జి. లక్ష్మీకాంత్, సత్తిబాబు, శ్రీను, నరసింహారావు, నాగయ్య, సురేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జయహో చంద్రయాన్..

చంద్రుడి దక్షిణ ధ్రువంపై భారత్ జయకేతనం

- విజయవంతంగా అడుగిడిన విక్రమ్ ల్యాండర్
- ల్యాండింగ్ ప్రక్రియను ఉత్సాహంగా వీక్షించిన విద్యార్థులు





చంద్రుగొండ: బాణాసంచ కాలుస్తూ సంబురాలు



భద్రాచలం అర్బన్: ఇస్రో ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన



మణుగూరు రూరల్ : చంద్రయాన్-3 ఆకృతిలో ఎక్సలెంట్ విద్యార్థులు

భద్రాచలంఅర్బన్: భారతీయుల ఆశలు తనతోపాటు మోసుకెళ్లిన చంద్రయాన్-3 జాబిలిపై భారత ఖ్యాతిని రెపరెపలాడించింది. చంద్రయాన్-3 విజయవంతం కావడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా అడుగిడుతున్న సమయంలో దేశఖ్యాతి ప్రపంచమంతా వ్యాప్తి చెందేలా కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తల కృషిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై అడుగిడిగే సందర్భాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఉత్కంఠగా ఆసక్తిగా తిలకించారు. చంద్రయాన్-2 నుంచి అనుభవాలను నేర్చుకొని 3ని విజయవంతంగా ప్రయోగించటంతో జిల్లాలోని భావి శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రయాన్-3 ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన

మణుగూరు రూరల్ : చంద్రయాన్-3 మూన్ మిషన్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ బుధవారం సీటైప్‌లోని ఎక్సలెంట్ హైస్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు చంద్రయాన్-3 ఆకృతిలో ప్రదర్శన నిర్వహించారు. ఎక్సలెంట్ విద్యాసంస్థల చైర్మన్ ఎండి యూసఫ్ షరీఫ్, ఎక్సలెంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఖాదర్, డైరెక్టర్లు యాకుబ్ షరీఫ్, ప్రిన్సిపల్ సమీన నయ్యర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు. మణుగూరులోని పైలట్‌కాలనీలో గల ఎక్సలెంట్ పాఠశాల విద్యార్థులు చంద్రయాన్-3 ప్రాజెక్ట్ నమూనా తయారు చేసి ప్రదర్శించారు.

సంబురాలు..

చంద్రుగొండ : చంద్రయాన్ ఆపరేషన్ సక్సెస్ కావడంతో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో బుధవారం సంబురాలు చేసుకున్నారు. ప్రధాన సెంటర్‌లో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి పరస్పరం మిఠాయిలు పంచుకున్నారు.

ప్రతీ భారతీయుడికి గర్వకారణం..



అమెరికా, రష్యా, చైనా తర్వాత చంద్రుడి మీదకు వెళ్లిన దేశంగా ఇండియాకే దక్కుతుంది. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంపై చాలా ఆనందంగా ఉంది. మనదేశం తరపున చంద్రుడి పైకి రాకెట్ పంపించడాన్ని ఒక భారతీయుడిగా ఎంతో గర్వంగా భావిస్తున్నా.

– సాయి చరణ్, 10 తరగతి, ప్రభుత్వ పాఠశాల, భద్రాచలం

స్ఫూర్తినింపేలా..



చంద్రయాన్-3 ప్రయోగం స్ఫూర్తి నింపేలా ఉంది. చంద్రుడి మీద ఉన్న మట్టిని పరీక్షించే విధంగా శాస్త్రవేత్తలు రూపకల్పనలు చేశారు. అధ్యాయనం గురించి మా పాఠశాలలో ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. చంద్రయాన్ -3 స్ఫూర్తితో మేము కూడా ప్రయోగాల వైపు దృష్టిసారిస్తాం. సమాజానికి ఉపయోగపడే ప్రదర్శనలు చేస్తాం.

– దినేష్, 10వ తరగతి, ప్రభుత్వ పాఠశాల, భద్రాచలం

ఉపాధ్యాయులు వివరించారు



చంద్రయాన్-3 గురించి వివరాలు ఉపాధ్యాయులు వివరించారు. చంద్రుడి పైకి చేరుకున్న తరువాత ల్యాండర్ లోపల ఉన్న రోవర్ బయటకు వచ్చి చంద్రుడిపై తిరుగుతుందని మన శాస్త్రవేత్తలు నాలుగు ఏళ్లుగా ఎంతో కష్టపడి తయారుచేశారని వివరించారు. చంద్రయాన్ -3 విజయవంతం కావడం ఎంతో ఆనందంగా ఉంది.

– దివ్య, 9వ తరగతి, ప్రభుత్వ పాఠశాల, భద్రాచలం

ఆస్ట్రోనాట్ అవుతా..



చంద్రయాన్ -3 ప్రయోగం మనదేశ చరిత్రను తిరగరాసింది. ఇలాంటి ప్రయోగాలు యువతలో ఆదర్శాన్ని నింపుతాయి. సైన్స్ వైపు అడుగులు వేసేందుకు చంద్రయాన్ -3 విజయం ఒక పాఠంగా నిలుస్తుంది. నేను ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్‌లో ఆస్ట్రోనాట్ అయ్యేలా ముందుకు సాగుతా.

– కేటికా బాసంతి, 9 వ తరగతి, భద్రాచలం

చంద్రయాన్ ఆదర్శం..



గడిచిన రెండు ప్రయోగాల్లో మన శాస్త్రవేత్తలు చంద్రుడిపైకి పరిశోధించేందుకు పంపిన రెండు రాకెట్లు చంద్రయాన్ 1, 2 విఫలం అయినా చంద్రయాన్ -3 ప్రయోగాన్ని సమర్థవంతంగా నిర్వహించారు ఈ చంద్రయాన్ -3 ప్రతీ ఒక్కరికి ఒక ఆదర్శం. దీనిని నేను ఎప్పటికి గుర్తుపెట్టుకుంటాను. నాకు సైన్స్ అంటే చాలా ఇష్టం.

– లీలావతి, 10వ తరగతి, ప్రభుత్వ పాఠశాల

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

అశ్వారావుపేట: ర్యాగింగ్ అనే సామాజిక భూతానికి దూరంగా ఉండాలని అశ్వారావుపేట సీఐ టి.కరుణాకర్ విద్యార్థులకు సూచించారు. ర్యాగింగ్ నివారణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ పర్యవసనాలను వివరించి దాని నిర్మూలనకు విద్యార్థులు ముందుకు రావాలన్నారు. ర్యాగింగ్‌పై ఫిర్యాదు చేయడం చాలా సులభమని డయల్ 100 సేవల గురించి వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వెంకన్న, శాస్త్రవేత్తలు గోపాల కృష్ణమూర్తి, ఐవీ శ్రీనివాసరెడ్డి, కే నాగాంజలి, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై గొంతెత్తి ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న ఐలయ్య

చంద్రుగొండ : ప్రజా సమస్యలపై గొంతెత్తి ఉద్యమిద్దామని సీపీఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని అయన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ స్థూపాన్ని ఆయన బుధవారం అవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడి వారి సమస్యల సాధనకు పోరాడేది ఎర్రజెండా మాత్రమేనన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు కాక సీత, కొండపల్లి శ్రీధర్, ఐలూరి రామిరెడ్డి, పెద్దిని వేణు, ఆర్ వెంకటాచారి, విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, మిరియాల మోహన్‌రావు అబ్దుల్ రెహమాన్, ఎస్‌కె. నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని దర్నా

చర్ల: చర్ల మండలంలోని గోదావరి ముంపు ప్రాంతాల బాధితులతో పాటు సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం తహసీల్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో దర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగాని బ్రహ్మాచారి మాట్లాడుతూ... బాధితులందరికీ ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలను ఇచ్చి ఇళ్లను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి కృష్ణ, మండల కమిటీ సభ్యులు మచ్చా రామారావు, బందెల చంటి, పామూరు బాలాజీ, సోడి వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెండో ఏఎన్‌ఎంల ర్యాలీ



వినతిపత్రం అందజేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలు

భద్రాచలంఅర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భద్రాచలం పట్టణంలో రెండో ఏఎన్‌ఎంలు ఏఐటీయూసీ అనుబంధం ఆధ్వర్యంలో బుధవారంర్యాలీ నిర్వహించారు. అనంతరం బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి బల్లా సాయికుమార్ మాట్లాడగా వీరభద్రమ్మ, సమ్మక్క, స్వరాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, స్వాతి, పూర్ణ, పద్మ, ముత్తమ్మ, శ్యామల, భూలక్ష్మి, భద్రమ్మ, సరస్వతి, విజయ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

రామయ్య దర్శనానికి రండి



రంగనాథ్‌ను ఆహ్వానిస్తున్న రోశిరెడ్డి

బూర్గంపాడు/: భద్రాచలంఅర్బన్: రామయ్య దర్శనానికి రమ్మని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను, సెంట్రల్ పొల్యూషన్ బోర్డు సభ్యులు మంకెన శ్రీనివాసరెడ్డిలను భద్రాచలం దేవస్థాన ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు యడమకంటి రోశిరెడ్డి ఆహ్వానించారు. బుధవారం వరంగల్‌లో వారిని కలిసి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యం

దుమ్ముగూడెం: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ మండలంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. అంజుబాక గ్రామంలో యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు చింతరేల సుధీర్ ఆధ్వర్యంలో పార్టీ డిక్లరేషన్లు రైతులకు వివరించారు. ప్రజల సంక్షేమానికి అందించే పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడారి ప్రదీప్, మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కోడి చంటి బాబు, భద్రాచలం యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ అంబటి మణికంఠ, టౌన్ వైస్ ప్రెసిడెంట్ శ్యామ్, లంకా శివ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి

భద్రాచలంఅర్బన్: జర్నలిస్టులపై సీఎం కేసీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని టీయూడబ్ల్యూజె(ఐజేయూ) రాష్ట్ర నాయకులు బి.వి.రమణా రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వ్యతిరేక వార్తలు రాసే వారికి ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామని సీఎం అనడం సిగ్గుచేటన్నారు. డివిజన్ అధ్యక్షులు తోకల నాగేశ్వరావు, జ్ఞానేందర్, దిలీప్ కుమార్, క్రాంతి కుమార్, లక్ష్మి నరసింహ నాయుడు, బాబు, జగన్, దుర్గారెడ్డి ఉన్నారు.

గులాబీ జెండా ఎగురవేసేందుకు కృషి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రేగా కాంతారావు

అశ్వాపురం: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించి, పినపాక నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మణుగూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అశ్వాపురం మండలంలో పలు గ్రామాలలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 200 కుటుంబాలు ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రేగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రహదారులకు నేడు శంకుస్థాపన..

మండలంలో రూ.8 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్లకు నేడు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు శంకుస్థాపన చేయనున్నట్టు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. . ఆనందాపురం-నెల్లిపాక, ఆర్అండ్‌బీ రోడ్డు నుండి రేగా కాలనీ వరకు, బీజీ కొత్తూరు నుండి నవోదయ స్కూల్ స్థలం వరకు, జగ్గారం -ఊకెవారిగుంపు, అశ్వాపురం-కొమ్ముగూడెం, ఆర్ అండ్‌బీ రోడ్డు నుండి ఆర్అండ్‌బీ రోడ్డు గొల్లగూడెం వరకు, అమెర్ద-అంబేడ్కర్‌నగర్, తుమ్మలచెరువు నుండి వెంకటాపురం కాలనీ వరకు బీటీ రోడ్లకు శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని తెలిపారు.

మలేరియా ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి



అశ్వారావుపేటరూరల్: వివరాలు సేకరిస్తున్న కంటివెలుగు అధికారి డాక్టర్ పర్శా నాయక్



దుమ్ముగూడెం: దోమల మందు పిచికారీ పర్యవేక్షిస్తున్న అధికారి చైతన్య

అశ్వారావుపేటరూరల్: మలేరియా ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, నివారణ చర్యలు చేపడుతున్నట్లు కంటివెలుగు ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ పర్శా నాయక్ తెలిపారు. మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీ పరిధిలోగల మలేరియా ప్రభావిత గ్రామమైన బండారిగుంపులో బుధవారం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికి రెండో విడత దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేస్తుండగా కంటివెలుగు జిల్లా అధికారి స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాట్ల మహేశ్వరరెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణదీపక్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ బైటా ధర్మారావు, సిబ్బంది శ్రీనివాస్, రాజు, విజయరెడ్డి, సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలి

దుమ్ముగూడెం: ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చైతన్య అన్నారు. బుధవారం పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల బక్కసింతలపాడు గ్రామంలో రెండో విడత దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దోమలమందు పిచికారిని డాక్టర్ చైతన్య పరిశీలించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రేణుకారెడ్డి, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం..

రామచంద్రుని పేట ఏజిహెచ్ఎస్ స్కూల్‌లో డాక్టర్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. హెల్త్ క్యాంప్‌లో చిన్న వ్యాధులకు మందులు అందజేశారు.

మాధవ్ సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న కనకయ్య

ములకలపల్లి : గ్రామ గ్రామాన సీపీఎం బలోపేతానికి చేడే మాధవ్ చేసిన సేవలు చిరస్మరనీయని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కొనియాడారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాయంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మాధవ్ వర్ధంతి సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ చిత్రపటానికి పూలామాలవేసి, నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, చేడే పద్మావతి, పొడియం వెంకటేశ్వర్లు, గౌరి నాగేశ్వరరావు, నిమ్మల మధు, సోయం వీరస్వామి, కీసరి వెంకట్రావు, వర్కా రుక్మాంగధరరావు పాల్గొన్నారు,

27న మున్నూరుకాపు సంఘం ప్లీనరీ

మణుగూరు రూరల్: ఈ నెల 27న హైద్రాబాద్‌లోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ భవన్‌లో జరగబోయే మున్నూరుకాపు సంఘం ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సంఘం పినపాక నియోజకవర్గ కో ఆర్డినేటర్ వలసాల వెంకటరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం మండలాధ్యక్షులు వన్నం కృష్ణమోహన్, కార్యదర్శి గాండ్ల సురేష్, నాయకులు గోపిశెట్టి శివయ్య, మేడ నాగేశ్వరరావు, పోట్ల ముత్తయ్య, దుర్గారావు, వనం సత్యనారాయణ, పోలిశెట్టి బాబు, తూపుడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నివాళి

దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెంలో పెనుబల్లి కన్నమ్మ మృతదేహానికి బుధవారం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ సోయం ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు గంగరాజు ఉన్నారు.

భద్రాచలంఅర్బన్: పట్టణంలో స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు గజ్జల సందీప్ వర్ధంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సందీప్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మారెడ్డి గణేష్, ఇంద్రకీలాద్రి, విష్ణు, ఆకాష్, కౌశిక్, గణేష్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల పోస్ట్‌కార్డు ఉద్యమం

చంద్రుగొండ: సమస్యల పరిష్కారం కోరుతు విద్యాశాఖలోని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు బుధవారం పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టారు. సీఎం కేసీఆర్‌తోపాటు ఐటీశాఖ మంత్రి కేటీఆర్, ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావుతోపాటు ఉన్నతాధికారులకు పోస్టుకార్డు ద్వాఆర తమ సమస్యలను విన్నవించామని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాణోత్ సేవియా తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గుగులోతు శ్రీనివాస్, బీ నాగమణి, శిరిష, ప్రవీణ్‌కుమార్, వెంకటరమణ, సునిత, కళ్యాణి పాల్గొన్నారు.

స్వయం సంఘాలను కలిసిన విద్యార్థులు

అశ్వారావుపేట: అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం స్థానిక సాయిరాం స్వయం సహాయక బృందాన్ని కలిశారు. కళాశాల ఆర్థిక శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐ.కృష్ణతేజ నేతృత్వంలో పొదుపు, సంఘాల ప్రాముఖ్యత, నిర్వహణ విషయాలను తెలియజేశారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ముకేశ్ మహాలింగ

బూర్గంపాడు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఒడిశా రాష్ట్ర బీజేపీ శాసనసభ్యుడు ముకేశ్ మహాలింగ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్‌యోజన కార్యక్రమంలో భాగంగా బుధవారం సారపాకలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బూత్‌స్థాయి నుంచి పార్టీ కమిటీలు వేసుకుని కార్యకర్తలను చైతన్యపరచాలన్నారు. తెలంగాణలో కుటుంబ పాలనను అంతమొందించేందుకు ప్రజలు బీజేపీతో కలిసి అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏనుగుల వెంకటరెడ్డి, ముస్కు శ్రీనివాసరెడ్డి, సీతారాం నాయక్, పున్నం భిక్షపతి, భూక్యా దివ్యశ్రీ, బీరక సాయి, శ్రీనివాసరెడ్డి, బాలునాయక్, వై.వెంకటేశ్వరరావు, కేసుపాక శ్రీనివాస్, రామారావు, సాయికిరణ్. రవీందర్‌రెడ్డి, రవిపటేల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ అభ్యర్థిగా స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రకటితమైన సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు వెంపాటి భరత్‌కుమార్, ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం విద్యార్థి నాయకుడు భరత్‌కుమార్, ఎమ్మెల్యేను తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో మర్యాదపూర్వకంగా కలసి, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాట్ల మధు, బీరెల్లి రాంబాబు, పండు, శ్రీను, రాము, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.